క్లుప్తంగా

క్రాప్ డిజిటల్ సర్వే



సయ్యద్‌అలిపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని సయ్యద్‌అలిపూర్‌లో మండల వ్యవసాయాధికారులు సోమవారం క్రాప్ డిజిటల్ సర్వే నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను సాగు చేసిన భూములకు మాత్రమే ఇవ్వనుండటంతో వ్యవసాయాధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశారు. గ్రామంలో ఎక్కువ మొత్తంలో కూరగాయ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సర్వే చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, పెంటయ్య, చంద్రిక, ఫీల్డ్ అసిస్టెంట్ మానిక్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



31వ వార్డులో సీసీ రోడ్డు పనులు

తాండూరు టౌన్: పట్టణంలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ సోమవారం ప్రారంభించారు. 31వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ బంటారం లావణ్యతో కలిసి శ్రీకారం చుట్టారు. 31వ వార్డులో తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలను పరిష్కరించామని, మురుగుకాలువ నిర్మాణం సైతం త్వరలోనే పూర్తి చేస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 24వ వార్డులో కౌన్సిలర్ సాహు శ్రీలతతో కలిసి గ్రీన్ బడ్జెట్ కింద కేటాయించిన రూ.6.50 లక్షలతో పార్కు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ డీఈ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ



కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ పండిట్ చంద్రకళాబాయి విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో తన తండ్రి స్వర్గీయ అంబూరావు హిందీ పండిట్‌గా, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు బూట్లను అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన నివాళి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి మరణం విచారకరమని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ గ్రామానికి వెళ్లి చంద్రారెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములు గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉన్న ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తారని వెంకట్రాములుగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు దశరథం, పాండు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పౌష్టికాహారం

- ఫొటో గుర్తింపుతో సరుకుల పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు ఆదేశాలు

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సజావుగా అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు పక్కదారి పట్టకుండా టీహెచ్‌ఆర్(టేక్ హోం రేషన్) తీసుకెళ్లే లబ్ధిదారు ఫొటోను తీసి పోషణ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు అందించే సరుకు తీసుకెళ్లే వారి చిత్రాన్ని ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు.

బయోమెట్రిక్‌తో హాజరు

మండలంలో మొత్తం 66 కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో మొత్తం 2550 చిన్నారులు ఉన్నారు. కేంద్రాల నిర్వహణ పారదర్శకత చేసేందుకు ముఖం గుర్తింపు హాజరు విధానాన్ని ముందుగా మూడేళ్ల లోపు చిన్నారులకు వర్తింపజేయనున్నారు. వీరికి టీహెచ్‌ఆర్, బాలామృతం అందిస్తున్నారు. ఈ వివరాలను పోషణ్ అభియాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందులోనే ప్రస్తుతం ముఖ గుర్తింపు(ఫేస్ అథెంటికేషన్) ఆప్షన్ తీసుకువచ్చారు. ఇందులోనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్, ఫొటో, లబ్ధిదారుల ఫోన్ నంబరు నమోదు చేస్తారు. ఇది పూర్తికాగానే లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్ యాప్‌లో పొందుపరిస్తే ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం సరుకులు, బాలామృతం అందించిన ప్రతిసారి ఫేస్ అథెంటిక్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతమైతే 3–5 ఏళ్ల లోపు చిన్నారులకు గర్భిణులు, బాలింతలకు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



గుండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్

పంపిణీ ఇలా..

కేంద్రాల్లో నమోదైన వారికి నిత్యం 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, నూనె, గుడ్డు, మురుకులు, బాలామృతం అందజేస్తున్నారు. అంగన్‌వాడీలో నమోదైన మూడేళ్లలోపు చిన్నారులకు ఇంటి వద్దకే ఈ పౌష్టికాహార సరుకులను అందజేస్తున్నారు. ఇవి పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా బోగస్‌లకు అడ్డుకట్ట వేయాలని మాతా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు సంబంధించి కేంద్రం నుంచి సరుకులు తీసుకెళ్లే వారి ఫొటోను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ముందుగా వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.

నెట్‌వర్క్ సమస్య

ఫొటో గుర్తింపు ధ్రువీకరణ నమోదు చేసేందుకు ఇంటర్నెట్ సమస్యగా మారింది. గ్రామాల్లో ఇంటర్నెట్ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. చాలా మంది చిన్నారులకు ఆధార నమోదు కాలేదు. దీంతో ధ్రువీకరణకు అడ్డుగా మారింది.

> **వివరాల నమోదు**
>
> సరుకుల పంపిణీలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఫొటో గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఇప్పుడు కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నాం. ఈ మేరకు టీచర్లు కేంద్రాల నుంచి సరుకులు తీసుకెళ్లే వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ విధానంతో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది.
>
> – మంజుల, సూపర్‌వైజర్ ఐసీడీఎస్, దౌల్తాబాద్



వార్డు ఆఫీసర్లతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- ఇప్పటికే 75 శాతం సర్వే పూర్తి
- మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

తాండూరు టౌన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా కొనసాగుతోందని పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. సర్వేలో నిర్లక్ష్యానికి ఏమాత్రం అవకాశం ఇవ్వరాదన్నారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సర్వేను పూర్తి చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని 36 వార్డుల నుంచి 12,800 వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో ఇప్పటికే 7 వేలకు పైగా సర్వేను పూర్తి చేశామన్నారు. సూపర్ చెక్ పవర్‌ను కమిషనర్‌కు ఇవ్వడంతో స్వయంగా తాను వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ వారాంతంలోగా మిగిలిన దరఖాస్తుల సర్వేను సైతం పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

300 వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తి

పట్టణంలో వీధి కుక్కల బెడద పెరగడంతో గత మూడు నెలలుగా వార్డుల్లోని 300 మగ కుక్కలను పట్టుకున్నామన్నారు. వీటికి స్థానిక డంపింగ్ యార్డులో ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వెటర్నరీ వైద్యుల సహకారంతో వాటికి స్టెరిలైజేషన్ పూర్తి చేశామన్నారు.

గణిత మేళాతో సృజనాత్మకత

దుద్యాల్: గణిత మేళాలు విద్యార్థుల్లో సబ్జెక్ట్‌పై భయం తొలగించేలా చేస్తాయని ఎంఈఓ విజయ రామారావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుదురుమల్ల జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత పరికరాలను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వృత్తం ,చతురస్రం, రాంబస్, సరళరేఖలు, ఖండన రేఖలు, డ్యాష్ బోర్డు వంటి పరికరాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ను గ్రామ మాజీ సర్పంచ్ రఘుపతి ప్రారంభించి అందుబాటులో తీసుకొచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ మెటీరియల్స్‌ను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయప్ప, ఇతర ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, ప్రతిభ భారతి, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే ఇంట విషాదం



శోభ (ఫైల్)

దోమ: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన చిన్నమ్మ తమ్మన్నగారి శోభ అనారోగ్యంతో మృతి చెందారు. రెండు నెలలుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్నారు. కాగా ఆమె పరిస్థితి క్షీణించడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ మేరకు కుటుంబసభ్యులు సోమవారం స్వగ్రామం శివారెడ్డిపల్లిలో అంత్యక్రియలు పూర్తి చేశారు.


సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

బంట్వారం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ సూచించారు. సోమవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులు గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై ఆయన ప్రజలకు వివరించారు. కులమతాలకు అతీతంగా సోదర భావంతో గ్రామస్తులంతా కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

దోమ: కేఎస్ఆర్ ట్రస్ట్ పేదలకు అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. దిర్సంపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన కోళ్ల చెన్నమ్మ కుటుంబ సభ్యులను సోమవారం ఆమె పరామర్శించారు. ట్రస్ట్ సభ్యులు ప్రకాశ్, అంజిలయ్య, లింగయ్య, మహేశ్, నారాయణతో కలిసి ఆర్థిక సాయం అందజేశారు.

కొడంగల్ ఏఓగా బాధ్యతలు చేపట్టిన పూజ



కొడంగల్ రూరల్: మండల వ్యవసాయాధికారిగా బి.పూజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎప్పటికప్పుడు సీజన్ల వారీగా పంటల సాగు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

‘ఓర్వలేక ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం’

మర్పల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి పండుగ తర్వాత అన్ని పథకాలు అమలు చేస్తున్నారని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.

వర్గీకరణలో భాగస్వాములు కండి



తాండూరు టౌన్: నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: మాదిగ విద్యార్థులు ఎస్సీ వర్గీకరణలో భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ పిలుపు నిచ్చారు. సోమవారం మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) విద్యార్థులతో తాండూరు పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణపై అనుకూల తీర్పు వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై వేసిన కమిషన్ నివేదికను త్వరగా ప్రభుత్వానికి అందజేయాలని కోరుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఎంఎస్ఎఫ్ విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ‘లక్ష డప్పులు, వేయి గొంతుకల’ పేరుతో నిర్వహించనున్న భారీ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ మాదిగ, పలు మండలాల కన్వీనర్లు జాని, బాల్‌రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ నియామకం

బొంరాస్‌పేట: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు మాదిగలు సంఘటితమై ఉండాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. నూతనంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన కార్యవర్గంతో కలిసి గ్రామ కమిటీ ఏర్పాటుకు పూనుకున్నారు. ఈ మేరకు మండల పరిధిలోని లింగన్‌పల్లి, ఎన్కేపల్లి గ్రామాల్లో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌మాదిగ నేతృత్వంలో సంఘం వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం జాతీయ స్థాయిలో పోరాడుతున్నారని, గ్రామస్థాయి నుంచి సంఘటితమై సాధించుకుందామని కోరారు. లింగన్‌పల్లిలో గ్రామ అధ్యక్షుడిగా ఎల్లప్ప, ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా హన్మంతులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమాల్లో గోవర్ధన్, ప్రశాంత్, సాయిలు, రాజేష్, ప్రభు, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే



అనంతగిరి: ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

అనంతగిరి: ప్రతి ఎకరాకు రూ.15వేల రైతు భరోసా ఇచ్చి తీరాల్సిందేనని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వికారాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎన్టీఆర్ చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. రైతులకు రూ.15వేలు కాకుండా తక్కువ ఇస్తామనడం దుర్మార్గమన్నారు. త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు నయిం, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, రామస్వామి, రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, నాయకులు శేఖర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గయాజ్, మూర్తుజా అలీ, ఫరీద్, అఫ్జల్ పాషా, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎకరాకు రూ.15వేలు ఇస్తామని ఇప్పుడు రూ.12వేలు ఇస్తామనడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అజీజ్ తదితరులు ఉన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు మహేన్‌రెడ్డి, అంజయ్యగౌడ్, నాయకులు రాచన్న, రమేష్ మిత్ర, అశోక్, గఫార్, మధుకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

హామీలు గాలికి

బంట్వారం: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ అన్నారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం ఆయన కరీంపూర్‌లోని పంట పొలాల్లో రైతులతో కలిసి నిరసన తెలిపార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి గాలికి వదిలేశారని విమర్శించారు.

జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తూరు: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సోమవారం మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీ దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో నిర్వహించే ఉర్సుకు జేపీదర్గా నుంచి తీసుకెళ్లనున్న చాదర్‌కు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

‘పీఎం స్వనిధి’కి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అనంతగిరి: వీధి వ్యాపారులు రుణాన్ని పొంది వ్యాపారంలో అభివృద్ధి చెందాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్ కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం సమావేశపుహాల్‌లో పీఎం స్వనిధి క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 8 రకాల స్కీంలకు అర్హులైన స్ట్రీట్ వెండర్స్ కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, పట్టణ ఐకేపీ కోఆర్డినేటర్ వెంకటేషం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాలిని, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ

బొంరాస్‌పేట: ప్రతి విద్యార్థికి జాతీయ స్థాయి నుంచి గుర్తింపునిచ్చే ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) ఐడీని కేటాయించాలని ఎంఈఓ హరిలాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ.. ఆధార్ కార్డు, పాఠశాల వివరాల్లో తప్పిదాలు లేకుండా ఒకే విధంగా ఉండాలన్నారు. ఈ విద్యార్థి ఐడీ నంబరులో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండలం, పాఠశాల, విద్యార్థి నంబరుతో కూడిన 12 అంకెల విద్యార్థి శాశ్వత గుర్తింపు ఐడీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు మల్లేశ్, పరమేశ్వరి, అన్వర్, గోపాల్, రామయ్య, జ్యోతి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కుల్కచర్ల: పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని నేతలు మోర వెంకటేష్, బాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కామునిపల్లి గ్రామానికి చెందిన శాగంటి లక్ష్మీనర్సింలుకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.22 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ఉన్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాల రఘునాథ్ రెడ్డి, రెడ్డిపల్లి రాములు, రాజు, మొగులయ్య, లాలయ్య, రాములు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాయకులు

వసతులు కల్పించాలని వినతి

చేవెళ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మహిపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వెంకటరామారావుకు ఏబీవీపీ నాయకులతో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో చదువుకుంటారని, వారికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. టాయిలెట్స్ ఉన్న వాటిని శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోవటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆరోపించారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి వెంటనే కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు.



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు